చదువు

10

హైదరాబాద్

మంగళవారం నవంబరు 14, 2023 ఈనాడు

■ e-mail: edc@eenadu.in

ఏది ఎంచుకుంటే మెరుగు?

బీఎల్ చివరి సంవత్సరం చదువుతున్నా. ఏడాది సీనియర్ దగ్గర పనిచేశాక ప్రాక్టీస్ పెట్టాలనేది నా కోరిక. కానీ మిత్రులు ఏదైనా కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం చూసుకోమంటున్నారు. రెండిట్లో ఏది మంచిది? – డి.రామకృష్ణ

■ వీటిలో మీకు ఏది బాగా ఇష్టమో నిర్ధరణకు రండి. రెండింటిలో ఉన్న లాభనష్టాలను బేరీజు వేసుకొని సరైన నిర్ణయం తీసుకోండి. మిత్రులు, కౌన్సెలర్లు సలహాలు మాత్రమే ఇవ్వగలరు. నిర్ణయం మాత్రం మీరే తీసుకోవాలి. ముందుగా సీనియర్ దగ్గర పనిచేసి సొంతంగా ప్రాక్టీస్ పెట్టే విషయానికొస్తే- సీనియర్ దగ్గర పనిచేస్తే, వృత్తిలో మెలకువలు నేర్చుకొని భవిష్యత్తులో సొంతంగా ప్రాక్టీస్ పెట్టుకొని మంచి న్యాయవాదిగా రాణించే అవకాశాలుంటాయి. దీంట్లో ఉన్న ఇబ్బంది ఏంటంటే, మీరు సొంతంగా ప్రాక్టీస్ పెట్టినప్పుడు, మొదట్లో మీరు జూనియర్ లాయర్ అని కేసులు ఎక్కువగా రాకపోయే అవకాశం ఉంది. లాయర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల పోటీ కూడా ఎక్కువే. మీరు లాయర్‌గా స్థిరపడటానికి చాలా సమయం పట్టవచ్చు. కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం చేస్తే ఉద్యోగ భద్రత ఉంటుంది కానీ, మీరు వ్యక్తిగతంగా కేసుల్ని వాదించి పేరు తెచ్చుకొనే అవకాశాలు తక్కువ. మీరు వాదించిన కేసుల్లో విజయం సాధించినా, ఆ విజయం మీరు పనిచేసే సంస్థకే చెందుతుంది. ఉదాహరణకు కొంత అనుభవం గడించి మీరే సొంతంగా కంపెనీ పెట్టడమా, జీవితకాలం ఏదో ఒక కంపెనీలో వేతనానికి పనిచేయడమా అనేది వ్యక్తిగత నిర్ణయం. కెరియర్లో రిస్క్ తీసుకోగల్గటం, ఉద్యోగ భద్రత, పరిమిత జీతం, అపరిమితమైన పేరు ప్రఖ్యాతులు, ఎక్కువ ఆదాయం అనే విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకోండి. ఏది సరైందో ఆలోచించి నచ్చిన నిర్ణయం తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

రక్షణ కొలువుకు సులువు దారి!

రక్షణ రంగంలో లక్షణమైన ఉద్యోగాలు ఆశించే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నాయి సైనిక్ స్కూళ్లు. ఆసక్తి ఉన్నవాళ్లు ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అక్కడే చదువుకోవచ్చు. అలాగే విద్యతోపాటు త్రివిధ దళాలకు కావాల్సిన నైపుణ్యాలనూ సొంతం చేసుకోవచ్చు. ఈ సంస్థల్లో వ్యక్తిగత క్రమశిక్షణకు ప్రాధాన్యం ఉంటుంది. వచ్చే విద్యాసంవత్సరంలో ఆరు, తొమ్మిదో తరగతుల్లో ప్రవేశానికి ప్రకటన వెలువడింది. ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఏఐఎస్ఎస్ఈఈ)– 2024తో దేశవ్యాప్తంగా ఉన్న సీట్లు భర్తీ చేస్తారు.

సైనిక స్కూళ్ల మార్గం

దేశవ్యాప్తంగా కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 33 సైనిక్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి పరీక్ష తప్పనిసరి. దీన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది. అలాగే కొత్తగా ప్రారంభమైన 19 సంస్థల్లో ఆరో తరగతిలోనే విద్యార్థులను చేర్చుకుంటారు. వీటికి సైనిక్ స్కూల్ సొసైటీ నిబంధనలు జారీ చేస్తుంది. కొత్తగా ప్రారంభమైన ప్రతి పాఠశాల కనీసం 40 శాతం సీట్లను ఆల్ ఇండియా మెరిట్ లిస్టు ప్రకారం భర్తీ చేయాలి. కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు, పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం... ఇలా పలు విభాగాల్లో ఈ స్కూళ్లు నడుస్తున్నాయి. అందువల్ల ఫీజు ఒకేలా ఉండదు.

ప్రయోజనాలెన్నో

ప్రభుత్వ పరంగా జరుగుతోన్న ఉద్యోగ నియామకాల్లో ఎక్కువ శాతం రక్షణ రంగంలోనే ఉంటున్నాయి. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సులతోపాటు సీఏపీఎఫ్‌లోకివచ్చే.. బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ, ఐటీబీపీ.. .తదితర విభాగాల్లో క్రమం తప్పకుండా ప్రకటనలు వెలువడుతున్నాయి. ఎక్కువ నియామకాలు ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఉంటాయి. యూపీఎస్‌సీ నిర్వహించే ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ వీటిలో అత్యంత ముఖ్యమైనది. అలాగే ఆర్మీలో గ్రూప్ ఎక్స్, వై. నేవీలో సెయిలర్-ఎంఆర్, ఎస్ఎస్ఆర్, ఏఏ. ఎయిర్ ఫోర్స్‌లో ఎయిర్‌మెన్ టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాలు ఇంటర్ విద్యార్హతతో భర్తీ చేస్తున్నారు. ఈ ప్రకటనలన్నీ ప్రతి ఆరు నెలలకు ఒకసారి వెలువడుతున్నాయి. వీటిని లక్ష్యంగా చేసుకున్న విద్యార్థులు హైస్కూల్ నుంచే సరైన శిక్షణ పొందితే సులువుగా విజయం సాధించగలరు అందువల్ల ఈ పరీక్షల్లో సైనిక్ పాఠశాల నేపథ్యం ఉన్న విద్యార్థులు ఎక్కువ మంది విజయవంతమవుతున్నారు. ఈ స్కూళ్ల పర్యవేక్షణ రక్షణ రంగంలో ఉన్నత స్థాయిలో పనిచేసినవారి ఆధ్వర్యంలో ఉంటుంది. ఇక్కడ చదువుతోపాటు క్రీడలు, క్రమశిక్షణ, శారీరక దృఢత్వానికి ప్రాధాన్యమిస్తారు. సీబీఎస్ఈ సిలబస్ అమలవుతుంది. ఆరో తరగతిలో ప్రవేశానికి బాలికలూ దరఖాస్తు చేసుకోవచ్చు. తొమ్మిదిలో చేరడానికి బాలురే అర్హులు. పరీక్షలో ప్రతిభ, మెడికల్ టెస్టులతో విద్యార్థులను ఎంపిక చేస్తారు.

పరీక్ష ఇలా

ఆరో తరగతికి: పరీక్ష 300 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో 125 ప్రశ్నలు వస్తాయి. సీబీఎస్ఈ ఐదో తరగతి సిలబస్ నుంచి వీటిని అడుగుతారు. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. మ్యాథ్స్ నుంచి 50 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు. జీకే (సైన్స్, సోషల్) 25, లాంగ్వేజ్ (ఇంగ్లిష్/తెలుగు/ హిందీ.. ఇలా నచ్చిన భాష ఎంచుకోవచ్చు) 25, ఇంటెలిజెన్స్ 25 చొప్పున ప్రశ్నలు వస్తాయి. ఒక్కో ప్రశ్నకు 2 మార్కులు. తెలుగు మాధ్యమంలోనూ పరీక్ష రాసుకోవచ్చు.

తొమ్మిదో తరగతికి: 400 మార్కులకు ఉంటుంది. ఇందులో 150 ప్రశ్నలు వస్తాయి. సీబీఎస్ఈ ఎనిమిదో తరగతి సిలబస్ నుంచి వీటిని అడుగుతారు. పరీక్ష వ్యవధి 3 గంటలు. మ్యాథ్స్‌లో 50 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు. ఇంగ్లిష్, ఇంటెలిజెన్స్, జనరల్ సైన్స్, సోషల్ సైన్స్ ఒక్కో విభాగం నుంచీ 25 చొప్పున ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలోనే ఉంటుంది.

రెండు తరగతుల ప్రవేశాలకు సంబంధించి పరీక్ష సిలబస్ వివరాలు ప్రకటించారు. సబ్జెక్టులవారీ ఆ పాఠ్యాంశాలను చదువుకుంటే సరిపోతుంది. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. వాటికి సమాధానాలను ఓఎంఆర్ పత్రంపై గుర్తించాలి. పరీక్షలో అర్హత సాధించడానికి సబ్జెక్టులవారీ కనీసం 25 శాతం మార్కులు తప్పనిసరి. అలాగే మొత్తం మీద 40 శాతం మార్కులు పొందాలి. ఇలా అర్హత మార్కులు సాధించినవారి జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఒక్కో సీటుకు ముగ్గురు చొప్పున వైద్య పరీక్షలకు ఎంపిక చేస్తారు. అందులో విజయవంతమైనవారిని ఆరు, తొమ్మిదో తరగతుల్లో చేర్చుకుంటారు. ఎస్సీ, ఎస్టీలకు కనీస మార్కుల నిబంధన లేదు.

సీట్లు.. ఫీజు

మొత్తం సీట్లలో 67 శాతం ఆ సైనిక్ స్కూల్ ఉన్న రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన సీట్లు ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలవారికి దక్కుతాయి. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతిలో 78, తొమ్మిదిలో 22 సీట్లు ఉన్నాయి. కలికిరి సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతిలో 105, తొమ్మిదిలో 10 సీట్లు ఉన్నాయి. ఈ రెండు పాఠశాలల్లోని 67 శాతం సీట్లకు ఏపీ, తెలంగాణ విద్యార్థులు పోటీ పడవచ్చు. సైనిక స్కూళ్లలో చేరిన విద్యార్థులు ఫీజు చెల్లించాలి. బోధన, వసతి, భోజనం అన్నీ కలిపి ఏడాదికి సుమారు రూ.1.20 లక్షలు అవసరమవుతాయి. అయితే మెరిట్ విద్యార్థులు, అల్పాదాయ వర్గాలకు రాష్ట్రాలు స్కాలర్‌షిప్పు అందించడం లేదా ఫీజు మినహాయించడం చేస్తున్నాయి. కొత్తగా ప్రారంభమైన అదానీ వరల్డ్ స్కూల్ నెల్లూరులో ఆరో తరగతిలోకి 80 సీట్లు కేటాయించారు.

ఏయే అర్హతలు?

ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం ఏదైనా పాఠశాలలో ఐదో తరగతి చదువుతుండాలి. అలాగే మార్చి 31, 2024 నాటికి వయసు 10 నుంచి 12 ఏళ్లలోపు ఉండాలి. అంటే ఏప్రిల్ 1, 2012 - మార్చి 31, 2014 మధ్య జన్మించినవారు అర్హులు. తొమ్మిదిలో చేరాలనుకున్నవారు ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతుండాలి. వయసు మార్చి 31, 2024 నాటికి 13 నుంచి 15 ఏళ్లలోపు ఉండాలి. అంటే ఏప్రిల్ 1, 2009 - మార్చి 31, 2011 మధ్య జన్మించినవారు అర్హులు.

దరఖాస్తులు: డిసెంబరు 16 సాయంత్రం 5 వరకు స్వీకరిస్తారు. **పరీక్ష ఫీజు:** ఎస్సీ, ఎస్టీలకు రూ.500. మిగిలిన అందరికీ రూ.650. **పరీక్ష తేదీ:** జనవరి 21

పరీక్ష కేంద్రాలు: ఏపీలో.. అనంతపురం, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం. తెలంగాణలో.. హైదరాబాద్, కరీంనగర్.

వెబ్‌సైట్: https://exams.nta.ac.in/AISSEE/

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

నార్త్-ఈస్టర్న్ హిల్ యూనివర్సిటీలో..

మేఘాలయలోని నార్త్-ఈస్టర్న్ హిల్ యూనివర్సిటీ (ఎన్‌ఈహెచ్‌యూ) 154 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

❒ సెక్షన్ ఆఫీసర్- 07 ❒ అసిస్టెంట్- 06
❒ ప్రొఫెషనల్ అసిస్టెంట్- 06 ❒ డ్రైవేట్ సెక్రటరీ- 07
❒ లోయర్ డివిజన్ క్లర్క్- 02 ❒ మల్టీ టాస్కింగ్ స్టాఫ్- 01
❒ స్టాటిస్టికల్ అసిస్టెంట్- 05 ❒ స్టెనోగ్రాఫర్- 6
❒ సెమీ ప్రొఫెషనల్ అసిస్టెంట్- 26 ❒ జూనియర్ లైబ్రరీ అసిస్టెంట్- 1
❒ లైబ్రరీ అటెండెంట్- 11

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, 10+2, సంబంధిత విభాగాల్లో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.
ఎంపిక: రాత పరీక్ష/ ట్రేడ్ టెస్ట్/ కంప్యూటర్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.500. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250. దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 02.12.2023.
దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరి తేదీ: 12.12.2023.
వెబ్‌సైట్: https://nehu.ac.in/

హెల్త్ అండ్ మెడికల్ సైన్సెస్ రీజనల్ సంస్థలో..

షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్టర్న్ ఇందిరా గాంధీ రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌ఈఐజీఆర్ఐహెచ్ఎంఎస్) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 85 గ్రూప్ 'బి', 'సి' పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
ఖాళీలు: అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, స్టోర్ కీపర్, అసిస్టెంట్ డైటీషియన్, రేడియోగ్రాఫర్, మెడికల్ సోషల్ వర్కర్, జూనియర్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్), జూనియర్ ఇంజినీర్ (సివిల్), ఫిజియోథెరపిస్ట్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్, వార్డెన్/ లేడీ వార్డెన్, టెక్నీషియన్ (ఎండోస్కోపీ/ కొలనోస్కోపీ), లోయర్ డివిజన్ క్లర్క్ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.
ఎంపిక: రాత/ ఆన్‌లైన్ పరీక్ష తదితరాల ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.11.2023.
వెబ్‌సైట్: https://hllneigrihms.cbtexam.in/Home/index.html

ప్రొటెక్షన్ ఆఫీసర్, సోషల్ వర్కర్ పోస్టులు

పార్వతీపురంలోని జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం- ఒప్పంద ప్రాతిపదికన పార్వతీపురం మన్యం జిల్లాలో కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

1. ప్రొటెక్షన్ ఆఫీసర్ 2. లీగల్ కమ్ ప్రొబేషన్ అధికారి
3. కౌన్సెలర్ 4. సోషల్ వర్కర్
5. అకౌంటెంట్ 6. డేటా అనలిస్ట్
7. ఔట్‌రీచ్ వర్కర్స్ 8. మేనేజర్/ కోఆర్డినేటర్ (మహిళ)
9. నర్సు (మహిళ)
10. సోషల్ వర్కల్ కం ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్ (మహిళ)
11. డాక్టర్ (పార్ట్ టైమ్) 11. ఆయా (మహిళ)
12. చౌకీదార్ (మహిళ) 13. అధికారి-ఇన్ ఛార్జి (సూపరింటెండెంట్)
14. స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్ 15. పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్
16. ఎడ్యుకేటర్ 17. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్
18. కుక్ 19. హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మెన్ 20. హౌస్ కీపర్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.
వయసు: 42 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, పార్వతీపురం, పార్వతీపురం మన్యం జిల్లా' చిరునామాకు పంపించాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23-11-2023.
వెబ్‌సైట్: https://parvathipurammanyam.ap.gov.in/

కృష్ణా జిల్లా మత్స్యశాఖలో సాగర మిత్ర

మచిలీపట్నంలోని మత్స్య శాఖ ఒప్పంద ప్రాతిపదికన కృష్ణా జిల్లాలో 8 సాగర మిత్ర పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
అర్హతలు: బీఎఫ్ఎస్సీ లేదా బీఎస్సీ (ఫిషరీస్ సైన్స్/ మెరైన్ బయాలజీ/ జువాలజీ).
వయసు: 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'కమిషనర్ ఆఫ్ ఫిషరీస్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా' చిరునామాకు పంపించాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 22-11-2023.
వెబ్‌సైట్: https://krishna.ap.gov.in/

మహిళ, శిశు సంక్షేమంలో..

ఒంగోలులోని జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం- ఒప్పంద ప్రాతిపదికన ప్రకాశం జిల్లాలో కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

1. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ 2. ప్రొటెక్షన్ ఆఫీసర్
3. లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ 4. సోషల్ వర్కర్ (మేల్)
5. డేటా అనలిస్ట్ 6. అవుట్‌రీచ్ వర్కర్ (మహిళ)
7. నర్సు 8. డాక్టర్ (పార్ట్ టైమ్)
9. చౌకీదార్ (మహిళ) 10. డేటా ఎంట్రీ ఆపరేటర్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.
వయసు: 42 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు : ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, ఒంగోలు, ప్రకాశం జిల్లా' చిరునామాకు పంపించాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 22-11-2023.
వెబ్‌సైట్: https://prakasam.ap.gov.in/

రాజమహేంద్రవరంలో అకౌంటెంట్‌లు

రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్సీఎస్సీఎల్) కాంట్రాక్ట్ ప్రాతిపదికన 2 అకౌంటెంట్ గ్రేడ్-3 ఖాళీల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
విద్యార్హత: ఎంకాంతో పాటు కంప్యూటర్ స్కిల్స్.
వయసు: 35 సంవత్సరాలు మించకూడదు.
ఎంపిక: అకడమిక్ మెరిట్, పని అనుభవం, అదనపు విద్యార్హతల ఆధారంగా.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయం, ఏపీఎస్సీఎస్సీఎల్, కలెక్టరేట్ కాంపౌండ్, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా' చిరునామాకు పంపించాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 18-11-2023.
వెబ్‌సైట్: https://eastgodavari.ap.gov.in/

తాజా ఇంటర్న్‌షిప్‌లు

అకౌంటింగ్ అండ్ బుక్ కీపింగ్

సంస్థ: నిధి ఎస్ జైన్ అండ్ కంపెనీ
ప్రదేశం: గుంటూరు, వైజాగ్, హైదరాబాద్, విజయవాడ
స్టైపెండ్: నెలకు రూ.7,500 **దరఖాస్తు గడువు:** నవంబరు 15
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ నైపుణ్యం
☛ internship.com/i/8a6818

విజయవాడలో

ఆపరేషన్స్

సంస్థ: ఐకుశల్ స్పేసెస్ **స్టైపెండ్:** నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: నవంబరు 16 **అర్హతలు:** ఆపరేషన్స్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/baf9c5

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: డిజిటల్ వెర్టో **స్టైపెండ్:** నెలకు రూ.4,000
దరఖాస్తు గడువు: నవంబరు 16 **అర్హతలు:** అడోబ్ ఫొటోషాప్, డిజిటల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, గూగుల్ అనలిటిక్స్, ఎస్ఈఎం, ఎస్ఈఓ నైపుణ్యాలు
☛ internshala.com/i/e52fbd

ఫీల్డ్ సేల్స్

సంస్థ: వల్లూరి నాగవెంకటసాయి అవినాష్ చౌదరి
స్టైపెండ్: నెలకు రూ.3,500
దరఖాస్తు గడువు: నవంబరు 20
అర్హతలు: ఫీల్డ్ సేల్స్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/d0c89a

గుంటుపల్లి, విజయవాడల్లో

వెబ్ డెవలప్‌మెంట్

సంస్థ: ఈకంప్లిసిస్ ఇండియా **స్టైపెండ్:** నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: నవంబరు 18
అర్హతలు: బూట్‌స్ట్రాప్, సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, జేక్వెరీ, మైఎస్‌క్యూఎల్, పీహెచ్‌పీ, వర్డ్‌ప్రెస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/c1e8d7

విశాఖపట్నంలో

వెబ్ డెవలప్‌మెంట్

సంస్థ: డిజిటల్ వర్డ్ ఆఫ్ మౌత్ **స్టైపెండ్:** నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: నవంబరు 17
అర్హతలు: బూట్‌స్ట్రాప్, సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, పీహెచ్‌పీ, రియాక్ట్‌జేఎస్, వర్డ్‌ప్రెస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/e8bde4

వర్క్ ఫ్రమ్ హోమ్

ఆపరేషన్స్

సంస్థ: సొల్యూషన్ గ్రాఫ్ **స్టైపెండ్:** నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: నవంబరు 22 **అర్హతలు:** ఇంగ్లిష్ రాయడం, మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్ internshala.com/i/4ccbdf

చలికాలంలో సాగటంలేదా సన్నద్ధత?

పొద్దున్నే లేచి చదువుకోవాలని బుద్ధిగా అలారం కూడా పెట్టుకుంటాం. కానీ మోగిన వెంటనే దాన్ని ఆపుచేసి ఐదే ఐదు నిమిషాల్లో లేవాలనుకుంటాం. ఐదు కాస్తా అరగంటా, గంటా కావచ్చు. ఈలోగా సమయం మించిపోవడంతో కాలేజీకి పరుగులు పెడతాం. పోనీ వచ్చాక ఎక్కువసేపు చదువుదామంటే అలసిపోవడం.. దానికి తోడు చలిగానూ ఉండటం వల్ల త్వరగా నిద్ర ముంచుకొస్తుంది. అంటే.. త్వరగా నిద్రపోతాం.. ఆలస్యంగా నిద్రలేస్తాం. దాంతో చదవాల్సినవి ఎక్కడికక్కడ పెరిగిపోతూ ఉంటాయి. ఇది ఇలాగే కొనసాగకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాల్సిందే. అవేమిటో చూద్దామా...

చలికాలంలో వాతావరణం హాయిగా ఉంటుంది. అటు ఎండల్లో మాడాల్సిన అవసరం ఉండదు. ఇటు వర్షంలో తడవాల్సిన పని ఉండదు. అయితే వచ్చిన చిక్కల్లా చలి కారణంగా బద్ధకం ఎక్కువవుతుంది. ఏ పనీ చేయాలనిపించదు. ఇంకా.. ఇంకా పడుకోవాలనిపిస్తుంది. చదవాల్సిన పాఠాలేమో కొండలా పేరుకుపోతూ ఉంటాయి. మరి మీ పరిస్థితీ ఇలాగే ఉందా?

1 చలి కారణంగా బద్ధకంగా ఉంటుంది. ఏ పనీ ఉత్సాహంగా చేయాలనిపించదు. కాస్త విసుగ్గా.. మరి కొంచెం చిరాగ్గానూ ఉంటుంది. వీటన్నింటినీ వదిలించుకోవాలంటే వీలైనంత తవరకూ శరీరానికి ఎండ తగలేలా చూడాలి. అంటే గదికే పరిమితం కాకుండా.. ఎక్కువసేపు ఆరుబయట గడపడానికి ప్రయత్నించాలి. ఒంటికి సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి.

2 విటమిన్-డికి దిగులును దూరం చేసే శక్తి ఉంటుంది. అది శరీరానికి అందాలంటే ఎండ తగలాలి. సాధారణంగా ఇంట్లో కూర్చుని చదువుకుంటాం కదా. అలాగే ఆరుబయట ఎండతగిలేలా కూర్చునీ చదవొచ్చు. ఇబ్బందిగా అనిపించకుండా.. ఏకాగ్రత కుదురుతుందీ అనుకుంటే మెల్లగా నడుస్తూ కూడా చదవొచ్చు.

3 తినే ఆహారంలోనూ తగినన్ని మార్పులు చేసుకోవాలి. వాల్‌నట్స్, సన్‌ఫ్లవర్, గుమ్మడి, చియా విత్తనాలు తరచూ తీసుకోవాలి. వీటి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. దాంతో ఈ కాలంలో ఎక్కువగా ఇబ్బంది పెట్టే జలుబు, దగ్గు, జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తపడొచ్చు.

4 ఆహారంలో భాగంగా.. ప్రొటీన్, ఫైబర్, విటమిన్లు ఎక్కువగా ఉండే బీన్స్, శనగలు, పప్పుదినుసులు ఉండేలా చూసుకోవాలి.

5 ఈ కాలంలో అందుబాటులో ఉండే పండ్లను.. ముఖ్యంగా విటమిన్-సి ఎక్కువగా ఉండే కమలాలు, కివీ, స్ట్రాబెర్రీ.. ఇతర పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. దీంతో వ్యాధినిరోధక శక్తి పెరిగి.. చలి కారణంగా తరచూ వచ్చే జలుబు బారిన పడకుండా ఉంటారు.

6 శరీరానికి వ్యాయామం ఉండేలా చూసుకోవాలి. కసరత్తులు చేయడం విసుగ్గా ఉంటే నచ్చిన క్రీడను ఎంచుకుని ఆడుకోవచ్చు. డాన్స్ ఇష్టమైతే నాలుగు స్టెప్‌లు వేయండి. బద్ధకం అందనంత దూరంగా పారిపోతుంది.

7 నిజానికి ఏ కాలంలో ఉండే ఇబ్బందులు ఆ కాలంలో పలకరిస్తూనే ఉంటాయి. కానీ వాటికి చిక్కకుండా చురుగ్గా, ఆనందంగా ఎలా ఉంటామన్నది మన చేతుల్లోనే ఉంటుంది. మన పనులను మనం సకాలంలో పూర్తిచేయలేకపోవడానికి వాతావరణంలో మార్పులు అనేవి ఒక సాకు కాకూడదు. దృఢ సంకల్పం ఉంటే.. వీటిని అధిగమించడం అసాధ్యంకాదు.

8 టైమ్‌టేబుల్ వేసుకుని దాన్ని కచ్చితంగా అమలు చేయాలని గట్టిగా నిర్ణయించుకోవాలి. కాలం ఏదైనా సరే.. దాని ప్రకారమే పనులన్నిటినీ పూర్తిచేయడానికి ప్రయత్నించాలి.